



ఎలమంచిలి మండలం పులపర్తి వద్ద జాతీయ రహదారి పక్కన లారీలను నిలిపివేసి విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవర్లు

కలగానే కాలిబాట వంతెన

కశింకోటవాసులకు అందుబాటులోకి రాని వారధి

- శారద నదిపై ఫుట్‌బ్రిడ్జి నిర్మాణానికి ఐదేళ్ల క్రితం శంకుస్థాపన

- డీఎంఎఫ్ నుంచి రూ.3 కోట్లు మంజూరు
- ఏడాదిలో వంతెన పూర్తవుతుందని నాటి ఎమ్మెల్యే అమర్ వెల్లడి
- రూ.50 లక్షల మేర పనులు చేసి బిల్లు పెట్టిన కాంట్రాక్టర్
- నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలుపుదల
- రెండున్నరేళ్లపాటు మంత్రిగా ఉన్నా.. పట్టించుకోని అమర్‌నాథ్



తాటి దోనెలపై నదిని దాటుతున్న మహిళా రైతులు

కశింకోట, మే 12 (ఆంధ్రజ్యోతి):

శారదా నదిపై కశింకోట వద్ద డీఎంఎఫ్ నిధులు రూ.3 కోట్లతో చేపట్టిన కాలిబాట వంతెన ఐదేళ్ల నుంచి పునాదుల్లోనే వుండిపోయింది. ఏడాదిలో వంతెన అందుబాటులోకి వస్తుందని, కశింకోట వాసుల ఇక్కట్లు తొలగుతాయని 2020 జనవరిలో శంకుస్థాపన చేసిన నాటి ఎమ్మెల్యే గుడివాడ్ అమర్‌నాథ్.. తరువాత మంత్రిగా పనిచేసినప్పటికీ వంతెన నిర్మాణం పూర్తికాలేదు. దీంతో వర్షాకాలంతోపాటు నదిలో నీటి ప్రవాహం అధికంగా వున్నప్పుడు అవతల వైపున వున్న పంట పొలాలు, కల్లాల వద్దకు వెళ్లరావడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి దోనెపై ప్రాణాలను ఫణంగా పెట్టి రాకపోలు సాగించాల్సి వస్తున్నది.

కశింకోట పంచాయతీలోని పలుకాలనీలు, వీధులకు చెందిన రైతుల పొలాలు శారదా నదికి అవతల వైపున వున్నాయి. చాలా మంది రైతులు తమ పశువులశాలలను కూడా పొలాల్లోనే ఏర్పాటు చేసుకున్నారు. పశువులకు మేత వేయడం, పాలు పితకడం, పొలాల్లో పనుల కోసం నిత్యం రైతులు, కూలీలు నది అవతల వైపునకు వెళ్లివస్తుంటారు. మునగపాక మండలం ఉమ్మలాడ వాసులు కశింకోట రావడానికి ఇదే దగ్గర దారి. నిత్యం సుమారు రెండు వేల మంది వరకు ఇక్కడ నదిని దాటుతుంటారు. శారదా నదిలో ఏడాదిలో ఏడెనిమిది నెలలపాటు నీటి ప్రవాహం అధికంగా వుంటుంది. ఇక్కడ వంతెన లేకపోవడంతో తాటిదోనెల ఆధారంగా నదిని దాటుతుంటారు. వరద ఉధృతి అధికంగా వున్నప్పుడు తాటిదోనెలు బోల్తాపడి, పలువురు మృత్యువాతపడిన సంఘటనలు కూడా వున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మించి తమ కష్టాలను గట్టెక్కించాలని రైతులు చాలా కాలంగా అధికారులను కోరుతున్నారు. ఎట్టకేలకు గత తెలుగుదేశం హయాంలో వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. గ్రీన్ సిగ్నల్ లభించేలోగా ప్రభుత్వం మారిపోయింది. కొంతకాలంపాటు

... మిగతా 8వ పేజీలో



శారదా నదిపై కాలిబాట వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

గత ప్రభుత్వం గాలికొదిలేసింది

- భీశెట్టి మహేశ్వరి
గవరపేట వీధి, కశింకోట



శారదా నదిలో దోనెపై ప్రయాణించడం ప్రమాదకరమైనప్పటికీ తప్పడం లేదు. చాలా ఏళ్ల క్రితం దోనెలో నదిని దాటుతుండగా వరద ఉధృతికి దోనె కొట్టుకుపోయి ఇద్దరు మృతిచెందారు. నదిపై కాలిబాట వంతెన నిర్మించాలని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నాం. గత ప్రభుత్వంలో పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా స్పందించి కాలిబాట వంతెన నిర్మాణం పూర్తిచేయాలి.

భానుడు భగభగ

ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

- వడగాడ్పులు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు
- ఇళ్ల నుంచి బయటకు రావడానికి వెనకడుగు
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన రహదారులు



అనకాపల్లిలో జనసంచారం లేని తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ ఎలమంచిలి/ కోటవురట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి):

అగ్నికార్తెలో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. కార్తె రెండు రోజుల క్రితం ప్రారంభంకాగా మొదటి రోజే ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. దీంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీక్షణంగా కాసింది. వడగాడ్పులకుతోడు గాలిలో తేమశాతం అధికంగా వుండడంతో విపరీతమైన ఉక్కపోత నెలకొంది. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వివిధ పనుల నిమిత్తం ఇళ్లనుంచి బయటకు వచ్చిన వారు ఎండబారిన పడకుండా పలుజాగ్రత్తలు తీసుకున్నారు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు పలుచోట్ల మధ్యాహ్నం సొమ్మసిల్లిపోయి చెట్ల కింద సేదతీరాల్సి వచ్చింది.

జిల్లాలో అత్యధిక మండలాల్లో సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైబడి నమోదయ్యాయి. అత్యధికంగా గొలుగొండ మండలంలో 41.8 డిగ్రీలు నమోదుకాగా, వాతావరణంలో నెలకొన్న అనిశ్చితితో సాయంత్రం ఈదురు గాలులు, పిడుగులతో వర్షం కురిసింది.

అనకాపల్లిలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం భయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే మెయిన్‌రోడ్డులో జనసంచారం బాగా తగ్గిపోయింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు ఎండ తీవ్రత, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెరకు రసం, రస్నీ, ఫ్రూట్‌జ్యూస్, శీతలపానీయాల అమ్మకాలు పెరిగాయి. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయన్న వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నర్సీపట్నంలో..

భానుడి భగభగలతో జనం బెంబేలెత్తిపోయారు. ఆదివారంతో పోలిస్తే సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత సుమారు మూడు డిగ్రీలు పెరిగింది. మధ్యాహ్నం సమయంలో 39 డిగ్రీలకుపైబడి నమోదు కావడంతో వేడిని తట్టుకోలేక చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించింది. దీనికితోడు ఉక్కపోత, వేడిగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి పట్టణంలోని పలు రహదారులు సోమవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూని తలపించాయి. భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎండచుర్రుమనిపించడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి వెనుకంజ వేశారు. మెయిన్ రోడ్డుతోపాటు పలు రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వాణిజ్య, వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులు లేక బోసిపోయాయి. ఉక్కపోతతో ఇళ్లల్లో ఉండలేక ఆవరణల్లోని చెట్ల కింద సేదతీరారు. దూర ప్రాంతాలకు సరకు రవాణా చేసే లారీలను జాతీయ రహదారి పక్కన చెట్ల నీడలో నిలుపుదల చేసి, డ్రైవర్లు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం వేడి తగ్గిన తరువాత ప్రయాణాన్ని కొనసాగిస్తామని చెబుతున్నారు.



ఖాళీగా వున్న నర్సీపట్నం మెయిన్ రోడ్డు



నిర్మానుష్యంగా మారిన కోటవురట్ల ప్రధాన రహదారి

యూటీఎఫ్ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి

- పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో లోపాలను సవరించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి):

పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పూటకోమాట, రోజుకో నిబంధనతో విద్యా వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం పాఠశాలలను ఆరు రకాలుగా విభజించగా, ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది రకాలుగా విభజించి ప్రజలను గందరగోళంలోకి నెట్టివేసిందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 117ను రద్దు చేస్తామని విద్యా శాఖ ఉన్నతాధికారులు పది నెలల నుంచి చెబుతున్నప్పటికీ రద్దు చేయలేదన్నారు. ఆ జీవోలో ఉన్న ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని కొనసాగించడం తగదన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి విధివిధానాలను వెంటనే రాష్ట్ర కమిషనర్ విడుదల చేయాలని, 12వ వేతన సవరణ కమిషన్ వేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం 15వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా చేపడతామని ఆయన తెలిపారు. అనంతరం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పంపనబోయిన వెంకటరావు, రొంగలి అక్కునాయుడు, జోగా రాజేశ్ గుత్తుల సూర్యప్రకాశ్, ఎంవీ అప్పారావు, మామిడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం

కొత్త మార్గదర్శకాల ప్రకారం పోస్టులు కేటాయింపు

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు 250 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులు
- మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు నియమించాలని ప్రభుత్వ ఆదేశం
- స్కూలు అసిస్టెంట్ పదోన్నతులపై నీలినీడలు



విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యా శాఖ సిద్ధమైంది. జీవో 117 రద్దు నేపథ్యంలో కొత్తగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం త్వరలో బదిలీలు చేపట్టనున్నది. ఒకటి, రెండు రోజుల్లో బదిలీల షెడ్యూల్ విడుదల కానున్నది. షెడ్యూల్ వచ్చే నాటికి బదిలీల ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు అమలుకు విద్యా శాఖ సన్నద్ధమవుతుంది. తాజాగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రస్తుతం ఎన్ని పోస్టులు ఉన్నాయి?, ఎంతమంది పనిచేస్తున్నారు?, ఖాళీలు ఎన్ని?, విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టీచర్లను సర్దుబాటు చేయగా ఎన్ని పోస్టులు మిగులుతాయి?...అనేదానిపై జిల్లా విద్యాశాఖ కసరత్తు పూర్తిచేసింది. బదిలీల జీవో వెలువడిన తరువాత దానిలో పేర్కొన్న విధంగా బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానం, అభ్యంతరాలు స్వీకరణ చేపట్టి తుదిగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నది.

పునర్వ్యవస్థీకరణ అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాలో అందుబాటులోకి రానున్న ఏడు రకాల పాఠశాలల్లో టీచర్లను నియమించనున్నారు. ప్రస్తుతం ఉన్న పోస్టులకు అదనంగా మరిన్ని అవసరమా?, లేక తగ్గించాలా?...అనే అంశంపై ఇప్పటికే అధికారులు ఒక అవగాహనకు వచ్చారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 250 వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులుతున్నట్టు గుర్తించారు. కొత్తగా రానున్న 237 మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూలు అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించినందున రమారమి 15 నుంచి 20 పోస్టులే మిగిలే అవకాశం ఉంది. ఒక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నపక్షంలో... అక్కడ ఖాళీగా ఉన్న పోస్టును తొలుత మిగులుగా గుర్తిస్తారు. అనంతరం ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్ పోస్టులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా లెక్కలు కట్టగా ఉమ్మడి జిల్లాలో తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులలో 250 స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నట్టు గుర్తించారు. అయితే వారిని కొత్తగా రానున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా

... మిగతా 8వ పేజీలో

నేడు పాడేరులో మోదకొండమ్మ అనుపోత్సవం

-8లో

సమ్మర్ ట్రిప్స్ క్యాన్సిల్

యుద్ధ నేపథ్యంలో ప్రయాణాలు రద్దు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

- ఊటీ, కాశీ వంటి చోట్లకు వెళ్లేందుకు కూడా వెనుకంజ
- పరిస్థితులు కుదురుకున్నాక వెళ్లవచ్చుననే యోచనలో అత్యధికులు
- టికెట్ల క్యాన్సిలేషన్‌కు ప్రత్యేకంగా కోడ్ ఇచ్చిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సీజన్ కావడంతో అనేక కుటుంబాలు ముందుగానే 'సమ్మర్ ట్రిప్'నకు ప్రణాళికలు వేసుకొని విమాన, రైలు టికెట్లతో పాటు పర్యటించే ప్రాంతాల్లో హోటల్ రూమ్‌లు కూడా బుక్ చేసుకున్నాయి. అయితే పహల్గాంలో పర్యాటకులనే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడులు చేయడంతో కశ్మీర్, శ్రీనగర్, వైష్ణోదేవి ఆలయ సందర్శనకు వెళ్లాలనుకున్న వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. ఆ తరువాత రెండు దేశాల మధ్య యుద్ధం మొదలుకావడంతో దేశంలోని 15 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో చాలామంది తమ టూర్లు

... మిగతా 8వ పేజీలో

కాశీ వెళ్లాలన్నా ఆందోళనగా ఉంది

- ముప్పిడి శ్రీనివాసరావు, సీతంపేట

ఐదు కుటుంబాలు కలిసి ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు కాశీ పర్యటన కోసం రైలు టికెట్లు, అక్కడ హోటల్ రూమ్‌లు బుక్ చేసుకున్నాము. ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలపైనే పాకిస్థాన్ దాడులు చేసే అవకాశం ఉందని వార్తాకథనాలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు కొంత కాలం వెళ్లకుండా ఉండడమే మంచిదని కూడా సూచిస్తున్నారు. దాంతో కాశీ పర్యటన రద్దు చేసుకుంటున్నాము. పరిస్థితులు కుదురుకున్నాక మరోసారి వెళదామని నిర్ణయించుకున్నాము.

మాడుగులలో అన్న క్యాంటీన్

- దుర్గాలమ్మ ఆలయ సమీపంలో స్థలం ఎంపిక
- రూ.65 లక్షలతో భవన నిర్మాణం
- త్వరలో పనులు ప్రారంభం



అన్న క్యాంటీన్‌కు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మాడుగుల, మే 12 (ఆంధ్రజ్యోతి):
మాడుగులలోని దుర్గాలమ్మ ఆలయ సమీపంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్టు

... మిగతా 8వ పేజీలో

వైస్ చైర్మన్‌ల అవిశ్వాస నోటీసు సంతకాల పరిశీలన

ఎలమంచిలి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ వైస్ చైర్మన్‌లపై 16 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస నోటీసులోని సంతకాల పరిశీలన పూర్తి కావచ్చిందని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. ఈ అవిశ్వాస నోటీసును జిల్లా కలెక్టరు పరిశీలన చేయాల్సి ఉందన్నారు.

నిప్పులు కురిపించిన సూరీడు



తలకు చున్నీలు కట్టుకుని నడిచివెళ్తున్న యువతులు

నక్కపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మే నెల ఎండ మంటలు పుట్టిస్తోంది. ఉదయం 8 గంటల నుంచే సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. బయటకు రావాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఎండ తీవ్రత కారణంగా గ్రామీణ ప్రాంత రహదారులు కూడా జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండలో బయటకు వెళ్లిన వారు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సోమవారం నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై వేసవి ప్రభావం కనబడుతోంది. గ్రామాల్లో అనేక రకాల వస్త్రాలు, స్టీలు సామగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలు, టార్పాలిన్స్, ఇతర వస్తువులను విక్రయించే వారంతా ఎండకు మాడిపోతున్నారు. ఎండల వల్ల వ్యాపారాలు పెద్దగా సాగడం లేదని చిల్లర వర్తకులు చెబుతున్నారు.

చోడపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



చోడపల్లిలో పనులకు శంకుస్థాపన చేసిన నేతలు

అచ్యుతాపురం రూరల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడపల్లి గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో డ్రైనేజీ, రూ.2.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ భర్త కోన బుజ్జి మాట్లాడుతూ త్వరగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వడిసెల శ్రీనివాసరావు, సర్పంచ్ గండిబోయిన భాను వెంకట్, మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు, నాయకులు కాకి నూకరాజు, ఎల్లా నూకనాథం, సింహాచలం, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గణపర్తిలో ఆక్రమణల తొలగింపు

మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తి గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను సోమవారం తొలగించినట్టు తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. ఆక్రమణదారుల నుంచి ఎటువంటి ప్రతిఘటన రాకుండా స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆక్రమణల తొలగింపును కొనసాగిస్తామని, సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమికి విముక్తి లభించనుందని తహసీల్దార్ చెప్పారు. ఆ స్థలంలో కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

కారు బోల్తా : తప్పిన ప్రమాదం



వెదుళ్లపాలెం వద్ద బోల్తాపడిన కారు

నక్కపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపాలెం వద్ద సోమవారం హైవేపై కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సోమవారం తుని నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు లారీని తప్పించబోయి దాన్నే ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆలపాటి నియామకంపై ఏపీయూడబ్ల్యూజే హర్షం

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్‌కుమార్‌ను నియమితులు కావడంపై ఏపీయూడబ్ల్యూజే ప్రెస్‌క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఏపీయూడబ్ల్యూజే పాయకరావుపేట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు నీలి సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, యూనియన్ నాయకుడు సేనాపతి లోవరాజు, కార్యవర్గ సభ్యులు జి రాజు, తాతాజీ, తోట రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రగడ నాగరమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం'



రాయితీపై దాణాను అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు

కోటవురట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అధికప్రాధాన్యత ఇస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాల వద్ద పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణాను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను పాడిరైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ పెట్ల నరేష్, పశువైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీరు రాని కొళాయిలు ఎందుకు?

▸▸ పెదకవలాపల్లిలో అలంకారప్రాయంగా జలజీవన్ మిషన్ కనెక్షన్‌లు ▸▸ పట్టించుకోని అధికారులు

రాంబిల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకవలాపల్లిలో జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన కొళాయిలు అలంకారప్రాయంగా మారాయి. మూడు వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందించేందుకు 7 నెలలు క్రితం జలజీవనన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటికి ఇబ్బంది ఉండదని గ్రామస్థులు సంబరపడ్డారు. కానీ కొళాయిలు ఏర్పాటు చేసినప్పటి నుంచి చుక్క నీరు కూడా రాలేదని వారంటున్నారు. నీరు రానప్పుడు కొళాయిలు ఎందుకని గ్రామస్థులు మండిపడుతున్నారు.



పెదకవలాపల్లిలో ఇళ్లకు ఇచ్చిన కొళాయి కనెక్షన్‌లు

వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వారంటున్నారు. కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందా? లేదా? అని చూడాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పెదకలవలాపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా పల్లా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



ఎలమంచిలిలో పప్పల చలపతిరావుకు కేకు తినిపిస్తున్న దృశ్యం



అచ్యుతాపురం: టీడీపీ కార్యకర్తలనుద్దేశించిన మాట్లాడుతున్న ప్రగడ

ఎలమంచిలి, మే 12 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, క్లస్టర్ ఇన్‌చార్జి బొద్దపు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు నమ్మి రమణ, యూనిట్ ఇన్‌చార్జి కరణం రవికుమార్, నేతలు బీశెట్టి చిన్నారావు, సూరకాసుల రమణ, గుర్రాల రాము, కోటిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, నేతలు ఆడారి మంజు, జనపరెడ్డి నర్సింగరావు, లాలం రాము, కె.శ్రీను, కర్రి రమణ, రాజాన విజయ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి జారి పడిన మూటలు

పేలుడు పదార్థమని స్థానికుల భయాందోళన... పోలీసులకు ఫిర్యాదు..

మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ నుంచి పెద్ద మూటలు రోడ్డుపై పడ్డాయి. మునగపాక మెయిన్‌రోడ్డు మధ్యం దుకాణానికి ఎదురుగా సోమవారం రాత్రి లారీపై తరలిస్తున్న మూటల్లో ఒకటి జారి పడింది. కింద పడడంతో మూటలోంచి రాళ్లు రోడ్డుపై చెల్లాచెదురు అయ్యాయి. అలాగే తిమ్మరాజుపేట జంక్షన్‌లో కూడా మరో మూట పడింది. వాటిని చూసిన కొందరు పేలుడు పదార్థంగా భావించి దూరంగా ఉన్నారు. స్థానికులు లారీని ఆపి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. అది సున్నపు రాయిని తలపించే విధంగా ఉండడంతో పేలుడు పదార్థం కాదని నిర్ధారించారు. రాయిపై నీటిని పోయగా అది సున్నపు రాయి వలే ద్రవపదార్థంగా మారింది. దాంతో చుట్టుపక్కల వారు ఊపిరిపీల్చుకున్నారు. అయితే సంఘటన జరిగిన సమయంలో రాకపోకలు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, ఎవరైనా వచ్చి ఉంటే వారు ప్రమాదానికి గురయ్యేవారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే ఇటు వంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయంటు పలువురు అంటున్నారు.



లారీ నుంచి జారిపడుతున్న మూటలు



మునగపాక జంక్షన్‌లో లారీ నుంచి జారి పడిన మూట

తూనికలు, కొలతలు కచ్చితంగా ఉండాలి

▸▸ జిల్లా కంట్రోల్ ఆఫీసర్ రవికుమార్



తూనికలు, కొలతలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కంట్రోల్ ఆఫీసర్ రవికుమార్

పాయకరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో విక్రయించే వస్తువుల తూనికలు, కొలతలు కచ్చితంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా అధికారి రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణ వ్యాపారులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కిరాణా, ఎరువులు, హార్డ్‌వేర్ వ్యాపారులు వినియోగదారులకు విక్రయించే వస్తువులకు సరైన తూకం వేయాలని, అదేవిధంగా వస్త్ర వ్యాపారులు సరైన కొలతలు వేసి వస్త్రాలు విక్రయించాలన్నారు. తూకం, కొలతల కోసం వినియోగించే కాటా, తూకం రాళ్లు, వేయింగ్ మెషిన్లు, కొలతల బద్దలకు ఏటా సీళ్లు వేయించుకుని సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. తూకం, కొలతల్లో తేడా ఉన్నా, నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ, స్థానిక కిరాణా వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, జయప్రకాష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ బాధ్యతల నుంచి తప్పించండి

▸▸ ఎంపీడీవోలకు అంగన్‌వాడీల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నక్కపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): తమకు పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ స్థానిక ప్రతినిధులు సోమవారం ఎంపీడీవో డీ సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధి దుర్గారాణి మాట్లాడుతూ ఇప్పటికే రకరకాల యాప్‌లతో తమపై పనిభారం పెరిగిందని, ప్రతీ నెలా ఒకటో తేదీ నుంచి పెన్షన్ పంపిణీ చేసే బాధ్యతలను తమకు అప్పగించడం వల్ల మరింత ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. ప్రతీ నెలా ఒకటో తేదీ నుంచి పిల్లల బరువు చూడడం,సరుకుల పంపిణీ,పిల్లలకు పోషకాహారం తయారు చేసి పెట్టడం,యాప్‌లో అప్‌లోడ్ చేయడం, వంటి పనులు వల్ల క్షణం తీరిక లేకుండా వున్నామని చెప్పారు. పెన్షన్ డ్యూటీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆమె వెంట యూనియన్ ప్రతినిధులు సుబ్బలక్ష్మి, పైడితల్లి, జయ, అపర్ణ, నాగమణి, లక్ష్మి, కాశితల్లి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

పింఛన్ల పంపిణీ నుంచి తమను మినహాయించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నారాయణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే పలురకాల యాప్‌లతో పనిభారం పెరిగిందని, దీనికి తోడు పెన్షన్ పంపిణీ అప్పగించడంతో తమపై మరింత భారం పడిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను పింఛన్ల పంపిణీ నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో హ్యాట్రిక్

మూడేళ్లుగా శతశాతం ఫలితాలు సాధించిన కోటవురట్ల కేజీబీవీ



కోటవురట్ల కస్తూర్బాగాంధీ విద్యాలయ భవనం

కోటవురట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యా పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన కేజీబీవీలో ఉపాధ్యాయులు విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన అందిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో ఆడపిల్లలను చదవించడానికి ముందురాని తల్లిదండ్రులు ఈ పాఠశాల్లో తమ పిల్లలను చదవించేందుకు పోటీ పడుతున్నారు. ఈ విద్యాలయంలో సీటు దొరకని పరిస్థితి నెలకొంది. కారణమేమిటంటే.. పదో తరగతిలో శతశాతం ఫలితాలు గత మూడేళ్లుగా వస్తున్నాయి.

కోటవురట్ల కేజీబీవీ 2009లో 80మందితో ప్రారంభమైంది. ప్రస్తుతం ఇక్కడ 235 మంది బాలికలు చదువుకుంటున్నారు. పాఠశాలకు ప్రహరీతోపాటు అన్ని సదుపాయాలు ఉన్నాయి. 2022-23లో 40 మంది విద్యార్థినులకు 40 మంది ఉత్తీర్ణులయ్యారు. 2023-24లో 36 మందికి 36 మంది పాసయ్యారు. 2024-25లో 30మందికి 30 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 13 మంది విద్యార్థినులు 500 మార్కులుపైబడి సాధించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగాను గతేడాది పాఠశాల ప్రిన్సిపాల్ సరితదేవికి ఉత్తమ అవార్డు దక్కింది. పాఠశాలలో విద్యార్థులకు టీచర్స్ డిజిటల్ విద్య బోధన అందిస్తున్నారు. చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తున్నారు. ఈ పాఠశాల నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై పలువురు విద్యార్థినులు బహుమతులను సాధించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నాణ్యత గల భోజనం, ఆరోగ్యం పట్ల ప్రిన్సిపాల్ సరితదేవి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని విద్యార్థినులు చెబుతున్నారు. వరుస మూడేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందుకోసం టీచర్స్ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పాఠశాలకు అదనపు గదులను ప్రభుత్వం నిర్మిస్తున్నది.

టీచర్స్ సహకారంతోనే శతశాతం ఫలితాలు

సరితాదేవి ప్రిన్సిపాల్, కేజీబీవీ, కోటవురట్ల

ఈ ఏడాది టెన్త్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాం. వీటి ద్వారా మంచి ఫలితాలు సాధించాం. టీచర్స్ ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్లే ఈ ఫలితాలు సాధించగలిగాం. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఉపాధ్యాయులకు పూర్తిగా సహకరిస్తున్నారు.



టెన్త్ విద్యార్థినులకు ప్రత్యేక స్టడీ అవర్

అరకు ఎంపీ తనూజరాణితో బొడ్డేడ భేటీ

మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా ఎంపీ తనూజరాణిని కలవడం జరిగిందని వైసీపీ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిశీకునిగా నియామకం అయిన తరువాత సోమవారం ఎంపీ తనూజరాణిని ఆమె ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందన్నారు. నియోజకవర్గం పరిధిలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించుకున్నామని, భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణను కూడా కలవడం జరిగిందన్నారు.

స్టాఫ్‌నర్సును సస్పెండ్ చేయాలి

▸▸ ఆశా కార్యకర్తల డిమాండ్



కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు

కోటవురట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఆశా వర్కర్‌పై చేయి చేసుకున్న స్టాఫ్‌నర్సును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కే వెంకటాపురం పీహెచ్‌సీకి చెందిన ఆశా కార్యకర్తలు సోమవారం కోటవురట్ల సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కశింకోట నుంచి డెలివరీ కేసును తీసుకు వెళ్లిన ఆశా కార్యకర్త మాధవిని స్టాఫ్‌నర్సు కొట్టడం దుర్మార్గమన్నారు. స్టాఫ్ నర్సుపై ఉన్నతాధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని.. లేకుంటే ఆందోళన విరమించేది లేదని ఆశా కారకర్తలు స్పష్టంచేశారు.

పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు



నాగులాపల్లి పిరమిడ్ కేంద్రంలో దుని ధ్యానం చేస్తున్న సభ్యులు

మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక తరగతులు జరిగాయి. ధ్యాన గురువు వనజ పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. ధ్యానం అనుకూల శక్తిని ఇస్తుందని చెప్పారు. సాయంత్రం దుని ధ్యానం నిర్వహించారు. సోమేశ్వరమ్మ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో మొల్లేటి లలిత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ శ్రీనివాస్‌కు మాజీ ఎంపీపీ మంజు అభినందనలు



మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్‌ను మాజీ ఎంపీపీ ఆడారి మంజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని పుష్పగుచ్ఛంతో అభినందనలు చెప్పారు. మునగపాక మండలంలో రాజకీయ అంశాలపై కొంతసేపు మాట్లాడడం జరిగిందన్నారు.

గ్రంథాలయ సభ్యత్వాలతో ఎన్నో ప్రయోజనాలు

నక్కపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పొందడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చిన దొడ్డిగల్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన సమాచారం, జనరల్ నాలెడ్జ్, ఇతర పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. వాటిని చదివి జ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా శ్రీవిద్య అనే బాలిక చార్ట్ రూపంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి వివరించి ఆకట్టుకుంది.

పైడిమాంబకు ఇత్తడి నాగాభరణం వితరణ



అమ్మవారికి ఇత్తడి నాగాభరణాన్ని అలంకరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు పైడిమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన అంగ అప్పలరాజు, సత్తిబాబు దంపతులు వితరణగా ఇచ్చిన ఇత్తడి నాగాభరణాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి అలంకరించారు. అంతకుముందు నాగాభరణాన్ని గ్రామంలో ఊరేగించారు. జాతర సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. మధ్యాహ్నం గ్రామంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మంగళవారం పైడిమాంబ అమ్మవారి జాతరను ఘనంగా జరపనున్నట్టు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

గోకులపాడులో కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురం శివారు గోకులపాడులో నూతన కమ్యూనిటీ భవనం నిర్మాణం పూర్తయినట్టు గ్రామ సర్పంచ్ కర్రి సత్యనారాయణ సోమవారం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. ఐదు లక్షలతో ఈ భవనాన్ని నిర్మించినట్టు ఆయన చెప్పారు.

20న సమ్మెను విజయవంతం చేయాలి

రాంబిల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 20వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ0 నాయకులు ధోని కాశియ్య, సుజాత, సావిత్రి, మంగ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరేవుపోలవరం సచివాలయం వద్ద సోమవారం గ్రామ సర్పంచ్ ఎం. లోవరాజు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మందికి కంటి వైద్య పరీక్షలు జరపగా.. పది మందికి ఆపరేషన్లు అవసరమని హైమా నేత్రాలయం వైద్యులు గుర్తించారని లోవరాజు చెప్పారు.

పలు గ్రామాల్లో
రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొరుప్రోలు, ఎస్.రాయవరం సబ్ స్టేషన్ల పరిధిలో పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలో ఎస్.రాయవరం టౌన్, బసవపాడు, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీపాలెం, రేవుపోలవరం, చినఉప్పలం, వాతాడ, బంగారమ్మపాలెం, పెదఉప్పలం గ్రామాలతో పాటు కొరుప్రోలు కాయిల్ పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు పంపిణీ



ఫీల్డు అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలో కొత్తగా నియమితులైన నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పీపీ అగ్రహారం ఫీల్డ్ అసిస్టెంట్‌గా ద్వారపు లక్ష్మి, తూటిపాలకు పైల సత్యవతి, అప్పన్నదొరపాలెంకి ఎద్దుల రాము, గిడుతూరు సుకల గోపిలు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పంచాయతీలలో వ్యవసాయ ఆధారిత పనులను అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగ పడే పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం ఎంపీడీవో ఛాయసుధ, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, ఏపీవో కాశీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : ఆర్డీవో



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో వీవీరమణ

నర్సీపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవవో వీవీ రమణ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలువురి నుంచి వినతులను ఆయన స్వీకరించారు. నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ ఆఫీసు దగ్గర సీసీ రోడ్డులో అడ్డుగా కారు పార్కింగ్ చేయడం వలన రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 26 అర్జీలు వచ్చాయని ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు.

'క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించాలి'



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న తాండవ చైర్మన్ సత్యనారాయణ

నాతవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. సోమవారం నాతవరంలో కోటమ్మ తల్లి పండగను పురస్కరించుకుని విజయ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, బెస్టు ప్లేయర్‌కు రూ.మూడు వేలు నిర్వాహకులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, ఎన్. విజయ్‌కుమార్, తాండవ డీసీ మెంబరు పారుపల్లి దాసు, టీడీపీ నేతలు బంగారు సూరిబాబు, పైల సూరిబాబు, యర్రా కాశీ, అంకంరెడ్డి యర్రాపాత్రుడు, శెట్టి లోవ, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

- ఏఎల్‌పురంలో పిడుగు పడి ఆవు మృతి
- అమ్మపేటలో పడిపోయిన విద్యుత్ స్తంభం



కృష్ణాదేవిపేటలో కురుస్తున్న వర్షం

కృష్ణాదేవిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగసింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. దీంతో ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలోని గొల్లవీధి, వినాయక, బీసీకాలనీల్లో సీసీరోడ్లపై మురుగునీటితోపాటు వర్షం నీరు ప్రవహించింది. కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో వర్షంనీటిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా కృష్ణాదేవిపేట వారపు సంతలో చిరువ్యాపారులు బేరాలు లేక నిరాశ చెందారు. ఆయా గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏఎల్‌పురంలో సోమవారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడి లాలం సత్యంమూర్తి ఆవు మృతి చెందింది.విలువైన ఆవు మృతి చెందిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. బాధిత రైతును ప్రభుత్వం, ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గొలుగొండలో..

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వర్షం పడింది. మండలంలోని జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, పాతమల్లంపేట, కొత్తమల్లంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అమ్మపేటలో విద్యుత్ స్తంభం నేలమట్టమైంది.



ఏఎల్‌పురంలో మృతిచెందిన ఆవు



అమ్మపేటలో పడిపోయిన విద్యుత్ స్తంభం

కైలాసపట్నం రోడ్డు పనులు అడ్డగింపు

- కామేశ్వరినగర్ జంక్షన్ వద్ద ఆక్రమణల తొలగింపునకు సిద్ధపడిన అధికారులు
- అడ్డగించిన ఆక్రమణదారులు



పనులను అడ్డగించిన ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అధికారులు

మాకవరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం కామేశ్వరినగర్ జంక్షన్ నుంచి కైలాసపట్నం వెళ్లే రోడ్డు పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. తామరం కామేశ్వరినగర్ నుంచి కోటవురట్ల మండలం కైలాసపట్నం వరకు 11.5 కిలోమీటర్లు కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ఆర్‌అండ్‌బీ జేఈఈ నారాయణ రెడ్డి, రెవెన్యూ ఆర్ఐ జట్టి ప్రయత్నించగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. కామేశ్వరినగర్‌లో 120 సర్వే నంబరు ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి దుకాణాలు, ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే రోడ్డు 40 అడుగులు పెరుగుతుండడంతో ఆక్రమణలు తప్పనిసరిగా తొలగించాలని ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు స్థానికులకు నచ్చజెప్పినప్పటికీ వారు వినకుండా పనులను అడ్డగించారు. దీంతో పనులు చేపట్టేందుకు వచ్చిన మిషన్లు వెనక్కి వెళ్లిపోయాయి. అధికారులు చేసేది లేక వారం రోజుల్లో ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు తప్పవని ఆక్రమణదారులకు చెప్పి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సాంబ, సర్వేయరు శ్రీకాంత్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేపట్టాలి

- ఏడీఏ ఉమాప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఉమాప్రసాద్

మాకవరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు మరింతగా చేపట్టాలని ప్రకృతి వ్యవసాయం ఏడీఏ ఉమాప్రసాద్ అన్నారు. సోమవారం కొండల అగ్రహారంలో ప్రకృతి వ్యవసాయంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతంగా మారి, సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అనంతరం రైతులకు ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అచ్చియమ్మ, ఎంపీపీ సర్వం, మండల వ్యవసాయాధికారి చిరంజీవి, టీడీపీ నాయకులు ఆర్‌వై పాత్రుడు, అల్లు రామునాయుడు, శంకరరావు, రాంబాబు పాల్గొన్నారు.

'సారాతో వీధిన పడుతున్న కుటుంబాలు'

నాతవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): సారాతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని తహసీల్దార్ వి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సారా నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాలలో సారా అమ్మకాలు చేసేవారి వివరాలను వీఆర్‌ఓలు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ రహీమ్ మాట్లాడుతూ సారా తాగడం వలన ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగంపేట నూకాలమ్మ భూముల కౌలు వేలం పాట

కృష్ణాదేవిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయ భూముల కౌలు వేలం పాట ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్టు దేవదాయ ఈవో దివ్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొత్తమల్లంపేట సర్వే నంబర్ 36/1లో 12.76 సెంట్లు కౌలుకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.10వేలు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డుతో పాల్గొనాలన్నారు.

మైనర్లు బైక్ నడపడం ప్రమాదకరం : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): మైనర్ల డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదంలో ప్రాణ నష్టం జరిగితే బైక్ ఇచ్చిన వారు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం చెట్టుపల్లిలో నిర్వహించిన మైత్రీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి, మైనర్లు బైక్ డ్రైవింగ్ వలన రోడ్డు ప్రమాదాలలో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. గంజాయి రవాణా చేసినా, సేవిస్తూ పట్టుబడినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

80 మంది రక్తదానం

నర్సీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ ఒకటో వార్డుకి చెందిన టీడీపీ నాయకుడు లాలం సూరిబాబు వర్ధంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 80 మంది యువకులు రక్తదానాన్ని చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రంలో 25వ కౌన్సిలర్ రాజేశ్, ఒకటో వార్డు టీడీపీ నాయకుడు లాలం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల డే

కృష్ణాదేవిపేట, మే 12(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో సోమవారం అంతర్జాతీయ నర్సుల డేను వైద్యసిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, ప్రసన్న, పద్మ, రత్నం, అనూష, రమణి, ప్రియాంక, ఎన్ఎన్ఎంలు పాల్గొన్నారు.

కంటారం వీఆర్పీ నియామకం రద్దు చేయాలి

గొలుగొండ , మే 12 (ఆంధ్రజ్యోతి): కంటారం పంచాయతీలో వీఆర్పీ నియామకం రద్దు చేయాలని ఎంపీడీవో మేరీరోజీకి ఎంపీపీ మణికుమారి, కంటారం సర్పంచ్ బిరిజాన రాజేశ్వరి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మణికుమారి మాట్లాడుతూ కంటారం పంచాయతీలో సర్పంచ్, ఉపాధి కూలీలకు ఎటువంటి సమాచారం లేకుండా నియమించడం తగదన్నారు. తక్షణమే వీఆర్పీని తొలగించి నూతనంగా నియామకం చేపట్టాలని కోరారు.

పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ

మాకవరపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందించే పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు అన్నారు. సోమవారం రాచపల్లి, తామరం, బూరుగుపాలెంల్లో పాడి రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కేతిరెడ్డి చిరంజీవి, పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మూడు హోటళ్లలో ఫుడ్ శాంపిల్స్ సేకరణ

నర్సీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒక అల్పాహారం, రెండు మాంసాహార హోటళ్లలో ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పాలిమార్, రఘు రెస్టారెంట్, శాంతిసాయి ఫుడ్స్‌లో తనిఖీ చేశామని తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చిన తర్వాత కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా పల్లా జన్మదిన వేడుకలు



పల్లా శ్రీనివాస్ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు నకురు కోటేశ్వరరావు, ఎలకా మల్లిబాబు. పాలెం నాయుడు, బుచ్చెయ్యపేట మండల నాయకులు దొండా నరేశ్, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


పెదగరువులో వైద్య శిబిరం ఏర్పాటు

రోలుగుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగరువులో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. నాలుగైదు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా చికిత్స చేయించారు. మరికొందరికి వైరల్ జ్వరాలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. వారికి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని సూచించారు. వైద్య శిబిరం మరో రెండు రోజులు కొనసాగిస్తామని తెలిపారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో సోమవారం బొయిలకింతాడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యులు తేజ్, కీర్తి, అనూషా తదితరులు 116 మందికి వైద్య తనిఖీలు చేసి 26 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని గుర్తించి ఉచిత ఆపరేషన్లకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో వైద్యులు వైసీపీ మండల అధ్యక్షులు, సర్పంచ్ బూరె బాబూరావు, చోడవరం సీడీసీ రామునాయుడు, నాయకులు కొమార బాబూరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంగళాపురం గ్రోయిన్‌కు మరమ్మతులు



గ్రోయిన్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళాపురం గ్రామంలో దెబ్బతిన్న గ్రోయిన్ మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. నిధులు విశాఖ డెయిరీ నుంచి అందిస్తుందని ఆనందకుమార్ తెలిపారు. మాజీ సర్పంచ్ డి.కిశోర్, పత్తి రామారావు ఆడారికి కృతజ్ఞతలు తెలిపారు.

మాడుగులలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. జాతర మహోత్సవం సందర్భంగా ప్రారంభమైన ఈ క్రికెట్ పోటీలు వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతాయి. ఎమ్మెల్యే బండారు క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం బ్యాటింగ్ చేసి క్రికెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే తీర్థ మహోత్సవాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించి యువత నైపుణ్యతను గుర్తించడం మంచి విషయమన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచి అందరికీ స్ఫూర్తిని ఇవ్వాలని కోరారు.

కాగా, విజేతలకు మొదటి బహుమతి మోదకొండమ్మ ఆలయ కమిటీ నుంచి రూ.1.25 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.80 వేలు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ద సీరీస్‌కి రూ.10 వేలు, బెస్ట్ బ్యాటింగ్, బౌలర్‌లకు చెరొక రూ.7,500 చొప్పున బహుమతి ప్రదానం ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుంచి 40 టీమ్‌లు వచ్చాయని, ఇంకా టీమ్‌లు రావాల్సి ఉందని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడయ్య నాయుడు, కమిటీ సభ్యును పాఠశాల కమిటీ చైర్మన్ జొన్నపల్లి రమేశ్, లక్ష్మీనారాయణ, రమేశ్, మరువాడ ఈశ్వరరావు, డిల్లీ నానాజీ, పంచాడ శ్రీను, రొబ్బ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతన అవకతవకలపై కూలీల బైఠాయింపు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన ఉపాధి కూలీలు

రావికమతం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు నిరసనగా సోమవారం వేతనదారులు గంప, పలుగు, పారలతో నిరసన తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీ శ్రామికులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండుటెండలో చెమటలుగా కక్కుతూ పని చేసినా రోజుకు రూ.150కు మించి వేతనం రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోజుకు రూ.300పైగా వేతనం నిర్ణయించినప్పటికీ తమకు తక్కువ రావడం వెనుక వీఆర్పీ అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపించారు. వీఆర్పీ గోరా సన్నిబాబు పనుల్లో పాల్గొకుండా ఇంటి వద్ద బంధువులకు, అనుసరులకు పనిలో మస్టర్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గ్రామంలో అధికారులు బహిరంగ విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే వీఆర్పీ నచ్చిన చోటే పనులు చేయిస్తుంటారని, ఎదురించే వారికి పనులే కల్పించరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావు మాట్లాడుతూ విచారణ చేపట్టి వాస్తవాలను గుర్తిస్తామని చెప్పారు. వీఆర్పీ అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రమ దోపిడికి పాల్పడేవారు ఎంతటి వారైన చర్యలు తప్పవని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

స్టాఫ్‌నర్సును సస్పెండ్ చేయాలని ఆశ కార్యకర్తల ధర్నా



రోలుగుంటలో నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

రోలుగుంట/రావికమతం, మే 12(ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఆశ కార్యకర్త మాధవిపై దౌర్జన్యం చేస్తూ తీవ్ర పదజాలంతో తిట్టిన స్టాఫ్‌నర్స్ సరళపై చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నాలు చేశారు. రోలుగుంటలో సీఐటీయూ మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కశింకోట పీహెచ్‌సీకి ఆశ కార్యకర్త మాధవి ఆదివారం ఓ మహిళకు ప్రసవం కోసం తీసుకువెళ్లగా, ఆ సమయంలో స్టాఫ్‌నర్సు సరళ తీవ్ర పదజాలంతో తిడుతూ దౌర్జన్యం చేశారని ఆరోపించారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే రావికమతం మండల కేంద్రంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రపు సత్యవతి ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, కశింకోట పీహెచ్‌సీ ఆశ కార్యకర్త మాధవి ఆదివారం రాత్రి డెలివరీ కేసును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుత్రికి తీసుకువెళ్లగా, విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్‌నర్స్ సరళ దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. బెడ్‌పైనే ప్రసవమైందని ఆశ కార్యకర్త మాధవి రూమ్‌లో ఉన్న స్టాఫ్ నర్స్ సరళికి తెలపగా, ఆమె కోపోద్రేక్తురాలై స్టాఫ్ నర్స్‌కు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తనకేమీ తెలియదని ఆశ చెప్తున్నప్పటికీ దాడికి పాల్పడం అన్యామన్నారు. దీనిపై స్టాఫ్ నర్స్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఆశాలంతా మద్దత్తు తెలిపారు.

మైనింగ్ అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

చోడవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా సాగుతున్న ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాల నిరోధానికి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండలంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు ప్రతిపక్ష నేతల సహకారంతో నరసాపురం, గవరవరం, ఖండేపల్లి, లక్కవరం, భోగాపురం, తదితర గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్, ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ తవ్వకాలకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అండగా ఉండడంతో మైనింగ్ మాఫియా బరితెగించిపోతున్నదని, అధికారులు కూడా చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మండలంలో అక్రమ తవ్వకాల నిరోధానికి తక్షణమే తగని చర్యలు చేపట్టాలని అప్పలరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వడ్డాది టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక

బుచ్చెయ్యపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దొండా నరేశ్, ఉపాధ్యక్షులుగా ముత్యాల సూరిబాబును ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ, అనుబంధ కమిటీలు పూర్తిచేశామని నూతన అధ్యక్షుడు తెలిపారు. రెండోసారి గ్రామకమిటీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే రాజుకు, స్టేట్ హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

చీడికాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగుతో తక్కువ ఖర్చుతో పాటు అందరికీ ఆరోగ్యం సమకూరుతుందని బైలపూడి సర్పంచ్ జాజిమొగ్గల గంగతల్లి అన్నారు. సోమవారం బైలపూడి గ్రామంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో చేసే పనుల గురించి యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిబ్బంది చెప్పే విత్తనాలు వేసుకొని మెలుకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో పాటు అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ సాగును పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు దాడి నాగరత్నం, సిబ్బంది గణపతి, బూరె రాము, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో పోలీస్ కస్టడీకి ఇద్దరు రిమాండ్ ఖైదీలు

రావికమతం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం వద్ద ఏప్రిల్ 6న జరిగిన యువకుడి హత్యకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న దుర్గాప్రసాద్, నరేంద్రకుమార్‌ను కోర్టు అనుమతితో రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నామని కొత్తకోట సీఐ కోటేశ్వరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం రావికమతం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరిద్దరూ గతంలో వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లాలో మూడు, కాకినాడ జిల్లాకు సంబంధించి ఒక్కటి, విశాఖ జిల్లా గాజువాక ప్రాంతంలో మరొకటి కలిపి ఐదు ద్విచక్ర వాహనాలను ఇద్దరు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం స్వాధీనం చేసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్లకు తదుపరి చర్యల కోసం పంపుతున్నామని సీఐ తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై అపరాధ రుసుం

రావికమతం, మే 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రెవెన్యూ పరిధిలో గొంప రహదారిని ఆనుకుని కొండపై అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డ యజమానికి రూ.50 వేలు అపరాధ రుసుం విధించినట్టు తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు. ఏప్రిల్ 23న గొంప సమీప కొండపై ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాక్ మెటల్ తవ్వుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఆర్ఐ సతీశ్ వెళ్లి విచారణ చేపట్టారని చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఉన్న యంత్రాన్ని సీజ్ చేశారని తహసీల్దార్ తెలిపారు.


మోదకొండమ్మ సన్నిధిలో ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ తదితరులు


ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు


పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం రాత్రి జనం రద్దీ

రెండో రోజూ ఘనంగా మోదకొండమ్మ జాతర

- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం.. ప్రధాన వీధులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పాడేరు, మే 12(ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాలు నేపథ్యంలో పాడేరులో సందడి నెలకొంది. స్థానికులు వివిధ ప్రాంతాల్లో ఉన్న వారి కుటుంబీకులు, బంధువులు, స్నేహితులను ఆహ్వానిస్తారు. అలాగే ఏజెన్సీతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు వస్తారు. శనివారం నుంచి బుధవారం వరకు ఈ ఉత్సవాల నేపథ్యంలో పట్టణం జనంతో కిటకిటలాడుతోంది. ప్రధానంగా సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు జాతరలో పాల్గొన్నారు. వీధుల్లో విద్యుద్దీపాలంకరణ తిలకిస్తూ, ప్లే జోన్‌లోని వివిధ వినోద క్రీడల్లో పాల్గొంటారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని బుధవారం స్వస్థలాలకు పయనమవుతారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

స్థానిక మోదకొండమ్మను సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనూజారాణి దంపతులు, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, స్థానిక అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరందరికీ ఎమ్మెల్యే, ఆలయ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. వారికి ఘనంగా సత్కరించారు. పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ అమ్మవారిని దర్శించుకున్నారు.



మోదకొండమ్మ పూజల్లో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు



ఎస్‌బీఐ ఎదురుగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఛీఫ్ మేనేజర్

భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ

పాడేరురూరల్: ఉత్సవాల్లోఅమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 10 స్టాల్స్‌లో తాగునీటిని సరఫరా చేశారు. అలాగే, స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఎస్‌బీఐ ఛీఫ్ మేనేజర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మజ్జిగ సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు, బంగారురాజు, నరసింహమూర్తి, కిరణ్‌కుమార్, వానపల్లి కుమార్, శివ, సూర్య, సత్యనారాయణ, మన్మథ పాల్గొన్నారు. సతకం పట్టు వద్ద వాసవీక్లబ్ ప్రతినిధులు శ్రీనాధు రాజు, పుట్టా నానాజీ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. మోదకొండమ్మకు పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొమ్మోజీ వెంకటరమణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారికి పట్టువస్త్రాలు అందిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘు నాయకులు

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పాడేరురూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్టు ఇంటర్ విద్యాధికారి సొంటేన భీమశంకర్ రావు తెలిపారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలలో జరిగిన ఈ పరీక్షలకు మొదటి సంవత్సర జనరల్ విద్యార్థులు 3,075 మంది లో 3.044 మంది హాజరుకాగా, 31 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 515 మందిలో 506 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజైనట్టు చెప్పారు. ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులు 1,564 మందిలో 1,550 మంది విద్యార్థులు హాజరు కాగా, 14 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మెడిక ల్ సౌకర్యాలు, పోలీస్ బందోబస్తు, సీసీ కెమె రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 144 సెక్షన్ అమలు చేశామన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 151 మందికి 137 మంది హాజరయ్యారని మిగిలిన 14 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 94 మందిలో 84 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరైనట్టు చెప్పారు.


పాడేరు జీకే కళాశాలలో హాల్ టికెట్ల నంబర్లు చూస్తున్న విద్యార్థులు

అర్హులందకీ ఉపాధి పని


తైడ వద్ద పశువుల తాగునీటి తొట్టెలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ ఆదేశించారు. మండలంలోని చిలకలగెడ్డలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం తైడ గ్రామంలోని పశువులకు తాగు నీటికోసం నిర్మించిన తొట్టెలను పరిశీలించారు. మండలంలోని పశువుల నీటి తొట్టెలు లక్ష్యం 60 కాగా, ఇప్పటికే 34 నిర్మించినట్టు చెప్పారు. అలాగే నీటికుంటలను సకాలంలోని పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీకి రోజుకు రూ.307 వర్తింపజేసేవిధంగా పనిచూపించాలన్నారు. వారు ఈ-శ్రమ, ఇన్సూరెన్స్ చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి అవార్డు ప్రదానం


శశిషణ్ముఖికి ప్రశంస పత్రం అందిస్తున్న డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, మే 12 (ఆంధ్ర జ్యోతి): సూర్య నమస్కారాల్లో పాల్గొని ప్రపంచ రికార్డు సాధించిన స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిని శశి షణ్ముఖికి డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా సోమవారం సంబంధిత ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గత నెల 7వ తేదీన అరకులోయ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో 21,850 మంది గిరిజన విద్యార్థులతో ప్రముఖ యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో 108 సూర్య నమస్కారాలు 108 నిమిషాల్లో చేయించడం ద్వారా ప్రపంచ రికార్డు సాధించిన విషయం పాఠకులకు తెలిసినదే. ఈ కార్య క్రమంలో శశి షణ్ముఖి పాల్గొని ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి, విద్యార్థుల సమక్షంలో శశి షణ్ముఖి కి ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంబసింగి, తాజంగిలో కారవాన్ టూరిజం


కారవాన్ టూరిజంకి స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, తాజంగి ప్రధానరహదారిలో కారవాన్ టూరిజం కేంద్రాల ఏర్పాటుకు స్థలపరిశీలన చేపట్టినట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. సోమవారం ఈ ప్రాంతాల్లో తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులు పర్యటించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కేరళలో కారవాన్ టూరిజానికి ఆదరణ లభిస్తోందన్నారు. బస్సులు, వ్యక్తిగత వాహనాల్లో వచ్చే పర్యాటకులు కారవాన్ కేంద్రాల్లో అవసరమైన కనీస సదుపాయాలు కల్పిస్తామన్నారు. పర్యాటకులకు బస చేసేందుకు ప్రత్యేక గదులు ఉండవని, సందర్శకులు వ్యక్తిగత వాహనాల్లోనే ఉంటారన్నారు. వీరికి అవసరమైన మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, రక్షిత తాగునీరు, క్యాంటీన్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈమేరకు తాజంగికి సమీపాన, లంబసింగి సమీపంలో భీమనాపల్లి సమీపాన స్థలాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ భూముల రైతులకు టూరిజంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వీఆర్వో సదానంద్ పాల్గొన్నారు.

సుజనకోటలో..

ముంచంగిపుట్టు: సుజనకోటలో తహసీల్దార్ నర్సమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఐటీడీఏ అధికారులు కారవాన్ టూరిజం ఏర్పాటుకు సోమవారం స్థల పరిశీలన చేశారు.మత్స్యగెడ్డ ఒడ్డున అనుకూలమైన స్థలం గుర్తించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్‌వో భాస్కర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి


వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్ర మూకలతో పోరాడి అమరుడైన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ మాట్లాడుతూ మురళీనాయక్ చేసిన సేవలను దేశం ఎప్పటికి మరిచిపోదన్నారు. దేశ రక్షణలో ఉంటున్న ఆర్మీ జవాన్‌లకు దేశ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, నాయకులు జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలని నిరసన


డీఈవో కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న ఉపాధ్యాయ సంఘు నాయకులు

పాడేరురూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరించాలని, జీవో 117 రద్దు, ఉపాధి బదిలీ షెడ్యూల్ తదితర డిమాండ్లపై ఉపాధ్యాయ సంఘ నాయకులు సోమవారం డీఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యా రంగాన్ని కుంటుపరిచే జీవో 117ను రద్దుపై చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లు ఇచ్చిన హామీలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతీ శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌లో 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే ఇద్దరు ఎస్‌జీటీలను నియమించాలని, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 21 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఏప్రిల్ నాటికి ఉపాధ్యాయులు, విద్యార్థుల రేషియో పరిగణలోకి తీసుకోవాలని, ఉన్నత పాఠశాలల్లో 2వ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి విద్యార్థుల సంఖ్యను 54కు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.మహేశ్వర రావు, వి.చిట్టిబాబు, పి.దేముడు, ఎం.ధర్మారావు, ఎస్.కన్నయ్య, కె.రఘునాథ్, సి.నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీలో గిరిజనులకు న్యాయం చేయాలి'

డుంబ్రిగుడ,మే 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంత నిరుద్యోగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్సీ శ్రీనివాసనాయుడికి పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు వినతి పత్రాన్ని అందజేశారు. పాడేరు పర్యటనలో భాగంగా డుంబ్రిగుడలో చేరిన ఆయనకు విన్నవించారు. జీవో 3కు ప్రత్యామ్నయంగా ఆర్డినెన్స్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఆప్తులు దూరం... నిరీక్షణ నరకం

- సీలేరు ఆస్పత్రుల్లో పోస్టుమార్టంనకు వసతి సమస్య
- భవనం, ఫ్రీజర్ సౌకర్యాల కరవు
- గ్రామ శివారునున్న శిథిల భవనానికి మృతదేహాలు తరలింపు

సీలేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే గది లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడినా, లేక హత్య, ప్రమాద సంఘటనలు సంభవించినప్పుడు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేంత వరకు వాటిని భద్రపరచడానికి కనీసం వీలులేకుండా ఉంది. స్థానిక ప్రభుత్వ పీహెచ్‌సీలో కానీ జెన్‌కో ఆసుపత్రిలో కానీ ఫ్రీజర్ సౌకర్యం, వాటిని భద్రపరిచేందుకు ప్రత్యేకమైన గది తదితర సౌకర్యాలు లేక మృతదేహాలను ఊరి శివారున మావోయిస్టులు పేల్చేసిన శిథిల భవనంలో ఉంచుతున్నారు. దీంతో ఇక్కడే సంబంధిత బంధువులు రోడ్డుపైన పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. మృతదేహాలకు సాయంత్రం లోపు పోస్టుమార్టం జరగకుంటే రాత్రంతా ఊరి శివారున చీకట్లో మృతదేహం వద్ద బిక్కుబిక్కుమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు జాగారం చేయాల్సిందే. ఈ నేపథ్యంలో ఆదివారంచింతపల్లిక్యాంప్‌లో జరిగిన బావమరుదుల హత్యా సంఘటనలో మృతదేహాలను తొలుత కొంతసేపు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉంచారు. అక్కడ ఆసుపత్రికి డెలివరీ కేసులు , రోగులు వస్తుండడంతో ఆ మృతదేహాలను ఊరి చివరన ఉన్న పాత చెక్‌పోస్టు భవనం వద్దకు తరలించారు.సాయంత్రం వరకు పోస్టుమార్టం నిర్వహించడానికి వైద్యాధికారులు చింతపల్లి నుంచి రాకపోవడంతో చేసేది లేక సాయంత్రం ఆరు గంటల సమయంలో రెండు మృతదేహాలను అం బులెన్సులో చింతపల్లి తరలించారు. సీలేరులో మృతదేహాలను భద్రపర్చడానికి , పోస్టుమార్టంనకు ఎటువంటి సౌకర్యాలు లేక తరచూ ఈ సమస్య ఎదురవుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సీలేరులో మృతదేహాలకు పోస్టుమార్టం కోసం భవనం, మృతదేహాలు పాడైపోకుండా భద్రపర్చడానికి వీలుగా ఫ్రీజర్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


జెన్‌కో చెక్‌పోస్టు భవనం వద్ద రోడ్డుపై సోమవారం మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పడిగాపులు

క్రీడలతో మానసిక ఉల్లాసం: సీఐ


జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీను ప్రారంభిస్తున్న సీఐ వెంకటరమణ, ప్రసాద్ తదితరులు

కొయ్యూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని స్థానిక సీఐ వెంకటరమణ సూచించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీను సోమవారం సీఐతోపాటు ఎంపీపీ బడుగు రమేశ్ బాబు ప్రారంరచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులు ఏజెన్సీలో ఉన్నారని, వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం చింతపల్లి జట్టు మొదట బ్యాటింగ్ చేసి 93 పరుగులు చేసి ఆలౌట్ కాగా, ఏవైసీ టీమ్ 75 పరుగులకు ఓటమి చెందారు. ఈ మ్యాచ్‌లో చింతపల్లికు చెందిన వినోద్ 50 పరుగులు సాధించటమే కాకుండా రెండు వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు నత్తూరు సోమన్నదొర, మాకాడ బాలరాజు, రాజేంద్రపాలెం, చీడిపాలెం ఎంపీటీసీ సభ్యుడు అంబటి నూకాలమ్మ, గంగా భవాని, ఐటీడీపీ ఇన్‌చార్జి కురుజు శ్రీను, అల్లూరి యూత్ సభ్యులు చిరంజీవి, నూకరాజు, వేణు, లవకుశ, వెంకటేశరు పాల్గొన్నారు.

వైద్య రంగంలో నర్సుల సేవలు కీలకం


నైటింగేల్ చిత్రపటానికి నివాళలర్పిస్తున్న వైద్యాధికారులు,నర్సులు

చింతపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నర్సులది కీలకమని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి భారతి కొనియాడారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. తొలుత నర్సుల వృత్తికి గౌరవం, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్సు నైటింగేల్ చిత్రపటానికి వైద్యాధికారులు, నర్సులు నివాళి అర్పించారు. అనంతరం కేక్‌ని కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన నర్సులను వైద్యులు సత్కరించారు. వైద్యాధికారి రుక్మిణి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, నర్సులు పాల్గొన్నారు.

కడుతుల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఎంపీడీవోకి వినతి పత్రమిస్తున్న గ్రామస్థులు

ముంచంగిపుట్టు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతులలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామ గిరిజనులు సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తికి వినతి పత్రమిచ్చారు. తమ గ్రామంలో సుమారు 103 కుటుంబాలకు చెందిన సుమారు 300 మంది జీవనం సాగిస్తున్నామని, ఉన్న నీటి పథకాలు పని చేయడంలేదన్నారు. దీంతో కలుషిత ఊటగెడ్డల నీటిపైనే ఆధారపడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీవో సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కొయ్యూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో చట్టపరమైన ఇబ్బందులతోపాటు వివాహాల అనంతరం దంపతులు ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి టి. మల్లేశ్ సూచించారు. డౌనూరు పంచాయతీ జోడుమామిడిలో బాల్య వివాహాలు, పోషకాహార లోపం, ఆరోగ్య సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం పది ఇంటర్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం వాలీబాల్ కిట్‌లను పంపిణీ చేశారు.కమిటీ సభ్యులు తిరుపతిబాబు, దేవరాజ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న యర్రచెరువుల యువత

గూడెంకొత్తవీధి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికార్జున గ్రామానికి చెందిన వృద్ధులకు లక్కవరపుపేట పంచాయతీ యర్రచెరువుల గ్రామ యువత దుప్పట్లను పంపిణీ చేశారు.సోమవారం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వ్యక్తిగత నిధులతో ఈ దుప్పట్లు అందజేశారు. ఈసందర్భంగా యువత నాయకుడు బూసారి బోడేశ్వరరావు మాట్లాడుతూఏజెన్సీలోని 11 మండలాల్లో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నామన్నారు. ఇలాంటి వారు ఫోన్: 63035 79210లో సంప్రదించాలన్నారు. ఆనందు, సురేశ్, బుజ్జి, రాఘవ, వినయ్, ప్రదీప్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో భారీ వర్షం


డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సోమవారం పలు చోట్ల భారీ వర్షం సోమవారం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ఏకధాటిగా వర్షం పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం నీటితో రహదారులు చిత్తడిగా మారాయి.

జి.మాడుగుల : మండలంలోని సోమవారం మధ్యాహ్నం కుండ పోత వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు పలు చోట్ల సుమారుగా గంటకు పైగా పడింది. దీంతో పాడేరు మోదమాంబ జాతరకు వెళ్లే జనాలు ఇబ్బందులు పడ్డారు.

హుకుంపేట; మండలంలోసోమవారం మధ్యాహ్నం 2నుంచి 5వరకు వర్షం కురిసింది. మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లాల్సిన వారు ఇబ్బంది ఎదుర్కొన్నారు.

అరకు ఎంపీతో బొడ్డేడ భేటీ

మునగపాక, మే 12 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా ఎంపీ తనూజరాణిని కలవడం జరిగిందని వైసీపీ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిశీకునిగా నియామకం అయిన తరువాత సోమవారం ఎంపీ తనూజరాణిని ఆమెఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందన్నారు. పలు సమస్యలపై చర్చించామన్నారు. మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణను కలిసినట్టు ఆయన తెలిపారు.

మహిళలకు డిజిటల్‌పై నైపుణ్యం అవసరం



సహాయక సంఘాల మహిళలతో వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు

చింతపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు డిజిటల్ నైపుణ్యతను పెంపొందించుకోవాలని వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మీర్ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వాసవ్య మహిళా మండలి 20 స్వయం సహాయ సంఘాల మహిళలకు ఒక్కరోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బి. స్ఫూర్తి, వాసవ్య ప్రాజెక్టు డైరెక్టర్ సునీత ఉన్నారు.

నాయీబ్రాహ్మణ కాలనీలో సమస్యల తిష్ఠ

కనీస సదుపాయాలు కరువు... పేరుకుపోయిన తుప్పలు
పట్టని అధికారులు, పాలకులు... మండిపడుతున్న కాలనీ వాసులు

కొత్తూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా... ఎందరో అధికారులు వచ్చిపోతున్నా నాయీబ్రాహ్మణుల కాలనీ మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రతీ పంచాయతీ పచ్చదనంగా ఉండడమే కాకుండా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, ఇక్కడ పట్టించుకునే నాథులే కరువయ్యారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. సుమారు 40 కుటుంబాలు ఉన్న ఈ కాలనీ పట్ల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ లైట్లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల చుట్టు పక్కల పిచ్చి మొక్కలు, డొంకలతో నిండిపోయి రహదారుల్లో పాములు, తేళ్లు వంటి విష జీవులు తిరుగుతున్నాయని, దీంతో అనుక్షణం భయంతో రాకపోకలు


సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు


కాలనీలో నిలిచిపోయిన మురుగు నీరు

సాగిస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జననివాసాల మధ్య విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను, పందులను నియంత్రించకపోవడంతో పలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కాలనీలో నిర్మాణం చేపట్టిన మురికినీటి కాలువలు అసంపూర్తిగా నిలిపివేయడంతో మురికినీరు నిల్వ ఉండడంతో దుర్వాసన, దోమలు ఎక్కువై రాత్రి సమయంలో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర జ్వరాల బారిన పడిన దాఖలాలు లేకపోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నాయీ బ్రాహ్మణ కాలనీలో సమస్యలను పరిష్కరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి

సమస్యలు పరిష్కరించకపోతే కార్యాలయం ముట్టడి

నాయీ బ్రాహ్మణ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని మహిళలను స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, కాలనీ మహిళలు తణుకు పావని, షేక్ బేగం, షేక్ నజీరా, సూదికొండ శాంతి, కాపారపు జగ్గయ్యమ్మ, కందికొండ వాణి, షేక్ మౌనరానిషా తదితరులు హెచ్చరించారు.

తహసీల్దార్‌గా సత్యనారాయణ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

కశింకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా జి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి అనకాపల్లి తహసీల్దార్ విజయ్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పూర్తి స్థాయిలో రెవెన్యూ సేవలు అందకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాయకరావుపేటలో పని చేసిన సత్యనారాయణను ఇక్కడ తహసీల్దార్‌గా నియమించారు.

పాడి రైతులకు దాణా గిన్నెల పంపిణీ

కశింకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘంలోని పాడి రైతులకు దాణా గిన్నెలు అందజేసే కార్యక్రమం సోమవారం జరిగింది. 2024-25లో సుఖీభవ కార్డులు ఉన్న 145 మందికి గిన్నెలు అందజేశారు. సంఘంలో ఇన్సూరెన్స్ పథకంలో ఉండి మృతి చెందిన పాడి రైతులు కర్రి గోవింద, తోరం చిన్నాయుడు కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున రెండు లక్షలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుమ్మిడి నారాయణరావు, ఏరియా సూపర్‌వైజర్ కాయల సత్యనారాయణ, వేతన కార్యదర్శి విరోతుల శ్రీను, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలి

తుమ్మపాల, మే 12 (ఆంధ్రజ్యోతి): బవులువాడ పంచాయతీ సర్వే నంబరు 70, 74, 75లోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా చేపడుతున్న రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం పాలకవర్గ సభ్యుడు సిహెచ్.రమణ మాట్లాడుతూ కొంతమంది క్వారీ యజమానులు కాలనీ వాసులను మభ్యపెట్టి అక్రమ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు. అధికారుల సైతం క్వారీ యజమానులకు కొమ్ముకాయడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రోడ్డు నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్ఎల్ఎన్ నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

జీవీఎంసీ డీఈ గోపాలకృష్ణ


రోడ్లను పరిశీలిస్తున్న డీఈ గోపాలకృష్ణ

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న లక్ష్మీనారాయణనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ డీఈ గోపాలకృష్ణ చెప్పారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే ఎజెండాగా' పేరుతో జనవరి 28వ తేదీన 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చా వేదికలో పలు పనులు జీవీఎంసీ అధికారులు చేపట్టగా, మరికొన్ని పనులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయమై ఇప్పటికే జోనల్ కమిషనర్ బీవీ రమణ దృష్టికి పలు సందర్భాల్లో 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కమిషనర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లగా అందుబాటులోనే ఉన్న జీవీఎంసీ డీఈ గోపాలకృష్ణను పిలిపించి పరిష్కరించాలని ఆదేశించారు. అంతేకాకుండా లక్ష్మీనారాయణనగర్‌లో చేపట్టాల్సిన డ్రైనేజీ ఔట్‌లెట్, రహదారుల నిర్మాణం, స్కేటింగ్ పార్కులో దెబ్బతిన్న సిమెంట్ బెంచీలు, స్కేటింగ్ పార్కు రోడ్డులో వీధి దీపాల ఏర్పాటుపై డీఈ పరిశీలించారు. ఔట్‌లెట్ నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి డీఈ తెలిపారు. అలాగే రహదారుల నిర్మాణానికి టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. స్కేటింగ్ పార్కులో కొత్త సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది బాలు ఉన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట బైఠాయించిన ఆశ కార్యకర్తలు

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తపై అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎన్టీఆర్ వైద్యాలయానికి ప్రసవం కోసం గర్భిణిని తీసుకువచ్చిన కశింకోట పీహెచ్‌సీ పరిధిలోని ఆశ కార్యకర్త సిహెచ్.మాధవిపై ఆదివారం రాత్రి వైద్యాలయంలోని మేటీ అసిస్టెంట్ సరళ మిశ్రా అకారణంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. అనంతరం యూనియన్ జిల్లా నాయకులు ఎల్.శాంతి, ఈ.పార్వతి, కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు కనీసం గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకారణంగా ఆశలపై దుర్భాషలు ఆడడం, దాడులు చేయడం ఎక్కువైందని, ఇటువంటి చర్యలు సరైనవి కావని వారు పేర్కొన్నారు. కాగా, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఘటనపై విచారణ జరిపి ఆశ కార్యకర్త పై దాడి చేసిన సరళామిశ్రాతో క్షమాపణ చెప్పించారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు సూర్యకళ, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పట్టణంలో పల్లా జన్మదిన వేడుకలు


పల్లా జన్మదిన కేక్ కట్ చేస్తున్న బత్తుల, బుద్ద, కోట్ని, తదితరులు

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పల్లా జన్మదిన కేకును కట్‌చేసి నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొలిశెట్టి శ్రీనివాసరావు, కాయల మురళీ, కుప్పిలి జగన్, ఎస్.శ్రీరామ్మూర్తి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయంలో పల్లా జన్మదిన వేడుకలను నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర టీడీపీ నాయకులతో కలిసి శ్రీనివాసరావు జన్మదిన కేకును కట్ చే సి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్, పీవీ.రమణ, దాడి జగన్, బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదనాయుడుపాలెంలో రాగి కాయల్ చోరీ


కాయల్ చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే...

సబ్బవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శివారు పెదనాయుడుపాలెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న రాగి కాయల్ చోరీ జరిగింది. ఎస్ఐ పి.సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ సమీపంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కంట్రోలర్ ఆఫ్ చేసి, ట్రాన్స్‌ఫార్మర్ విప్పేసి కిందికి పడేసి ట్రాన్స్‌ఫార్మర్ లోపల ఉండే రాగి కాయల్‌ను ఎత్తుకుపోయారు. రాగి కాయల్ సుమారు 35 కిలోలు ఉంటుందనీ, విలువ రూ.40 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఏఈ అశోక్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


పార్టీ నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు మరింత కృషి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సూచించారు. మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్టంగా ఉంటే కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు.

గ్రామ కమిటీ కార్యవర్గం

వెన్నెలపాలెం గ్రామ కమిటీఅధ్యక్షుడిగా బోజంకి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడిగా వెన్నెల గిరి, ప్రధాన కార్యదర్శిగా బండారు వీరునాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వెన్నెల అప్పారావు, కూండ్రపు అప్పారావు, మరం అచ్చిబాబు, కార్యదర్శులుగా రొంగలి సత్తిబాబు, పెదపాటి మహేశ్, జంగాల త్రినాథ్, కోశాధికారులుగా గోపి కనకరాజు, పైలా సన్యాసిరావు ఎన్నికయ్యారు. అలాగే తెలుగు యువత గ్రామ అధ్యక్షుడిగా కాండ్రేగుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సిరపురపు అయ్యబాబు, ఐటీడీపీ గ్రామ అధ్యక్షుడిగా ఎలమంచిలి కిశోర్, ప్రధానకార్యదర్శిగా వెన్నెల రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైలా రథాల సన్యాసిరావు, నాయకులు గొంప మారునాయుడు, పైలా వరలక్ష్మి, పైలా సన్యాసిరావు, పైలా కనకరాజు, బోజంకి గోపి పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


నెహ్రూచౌక్‌లోని బుద్ధుని విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద బుద్ధుని విగ్రహానికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసే పరమ ధర్మమని బోధించిన మహనీయుడు గౌతమ బుద్ధుడని పేర్కొన్నారు. బొజ్జన్నకొండ వద్ద బుద్ధునికి ఏటా పూజలు జరుగుతున్నాయన్నారు. అలాగే నెహ్రూచౌక్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో బుద్ధుని జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధుని చిత్రపటానికి బల్లా నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి ప్రదాత బుద్ధుని జయంతి వేడుకలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, వి.నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అలాగే బొజ్జన్నకొండ వద్ద బుద్ధుని విగ్రహాలకు బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బల్లా నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతతకు పంచశీల సూత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. అహింస సిద్ధాంతాన్ని అవలంబించడం ద్వారా శాంతిని నెలకొల్పవచ్చునన్నారు. వేలాది మంది దేశ, విదేశ బౌద్ధ ప్రియులకు ఆరాధన స్థలంగా ఉన్న బొజ్జన్నకొండను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బొజ్జన్నకొండను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమలో బౌద్ధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా బలిరెడ్డి


బలిరెడ్డి అప్పారావు

సబ్బవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత మండల అధ్యక్షుడిగా ఇరువాడకు చెందిన బలిరెడ్డి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ అధ్వర్యంలో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. అప్పారావు 1999 నుంచి 2004 వరకూ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలుగు యవత మండల అధ్యక్షుడిగా నియమించినందుకు గండి బాబ్జీకి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టీడీపీ భలోపేతానికి కృషి చేస్తానన్నారు. అలాగే బంగారమ్మపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దాడి కన్నంనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

పరవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో భరణికం గ్రామానికి చెందిన నేతల సోమేశ్ ఇటీవల క్రికెట్ ఆడుతూ కిందపడడంతో గాయపడ్డారు. దీంతో కుడి కాలికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉండగా, స్నేహితులైన దేవరాపల్లి మండలం తెనుగుపూడి రెసిడెన్షియల్ కళాశాల 2006-08 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు అతనికి ఆసరాగా నిలిచారు. సోమేశ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం రూ.21 వేలు అందజేశారు.

అసకపల్లిలో భూ ఆక్రమణలపై ఫిర్యాదు

సబ్బవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి సర్వే నంబరు-1లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన కర్రి కనకరాజు సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసకపల్లి సర్వే నెంబరు 1లో సుమారు 250 ఎకరాలు ప్రభుత్వ భూమి/కొండ పోరంబోకు భూమి ఉందన్నారు. 2018లో సదరు భూమిలో ప్రభుత్వం కొంత మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. సదరు భూమికి ఆనుకొని కొంత ఖాళీ భూమి ఉందన్నారు. సదరు ప్రభుత్వ భూత్వ భూమిని కొంత మంది గ్రామస్తులు, స్థానిక నాయకులు కలసి 2,3 సెంట్లు ప్లాట్లుగా విభజించి స్థానికేతరులకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు స్థలాల్లో గత కొన్ని రోజులుగా బేస్మెంట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. విచారణ చేపట్టి ఆక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీడీపీ సీనియర్ నేత సన్యాసినాయుడు మృతి


సన్యాసినాయుడు (ఫైల్)

కశింకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కలగా సన్యాసినాయుడు (53) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన నందమూరి తారక రామారావు వీరాభిమానిగా తెలుగుదేశం పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. బయ్యవరం గ్రామ ఉప సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి ఎన్నో విధాలుగా సేవలందించారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని పార్టీ నాయకులు తెలిపారు.

యువకుడి హత్య కేసులో పోలీస్ కస్టడీకి ఇద్దరు రిమాండ్ ఖైదీలు

రావికమతం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం వద్ద ఏప్రిల్ 6న జరిగిన యువకుడి హత్యకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న దుర్గాప్రసాద్, నరేంద్రకుమార్‌ను కోర్టు అనుమతితో రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నామని కొత్తకోట సీఐ కోటేశ్వరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం రావికమతం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరిద్దరూ గతంలో వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లాలో మూడు, కాకినాడ జిల్లాకు సంబంధించి ఒక్కటి, విశాఖ జిల్లా గాజువాక ప్రాంతంలో మరొకటి కలిపి ఐదు ద్విచక్ర వాహనాలను ఇద్దరు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం స్వాధీనం చేసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్లకు తదుపరి చర్యల కోసం పంపుతున్నామని సీఐ తెలిపారు.

అనకాపల్లిలో చెత్త తొలగింపు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


వేల్పులవీధి, మార్కెట్ వద్ద పరిశుభ్రం చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జీవీఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు సోమవారం పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. 'వారాంతపు రోజున ఊరంతా చెత్తే' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ.రమణతో పాటు శానిటేషన్ విభాగం సూపర్‌వైజర్ రవికుమార్ స్పందించారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి తెల్లవారుజామునే రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కాలువల్లో నీరు పారే విధంగా చర్యలు చేపట్టారు. జోనల్ కమిషనర్ బీవీ రమణ తెల్లవారుజామునే పలు ప్రాంతాల్లో పర్యటించి చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లోని పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీ మినహాయించాలి

▸▸ ఎంపీడీవోకు యూనియన్ ప్రతినిధుల వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

కశింకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలను పెన్షన్ డ్యూటీ నుంచి మినహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో వీవీ.రవికుమార్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు కె.తనూజ, డి.రమణి, ఎం.అమ్మాజీ, బి.సూర్యకుమారి, బి.లక్ష్మి, ఎస్.రమణమ్మ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తకు రకరకాల యాప్‌ల వల్ల పనిభారం పెరిగిందని, ప్రభుత్వం వచ్చిన కొత్తలో గ్రామాల్లో పెన్షన్ పంపిణీ సచివాలయం సిబ్బందికి రెండు, మూడు నెలలు సహకరించాలని చెప్పారన్నారు. కొన్నిచోట్ల ఇప్పటికీ పెన్షన్ పంపిణీ చేయాలని చెప్పడం తగదన్నారు. తమ బాధలు అర్థం చేసుకొని పెన్షన్ డ్యూటీ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు మినహాయించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

గోకర్ణేశ్వర బాలా త్రిపురసుందరిదేవిని దర్శించుకున్న జడ్సీ

అనకాపల్లి టౌన్: స్థానిక సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలోని సోమవారం గోకర్ణేశ్వర బాలాత్రిపురసుందరిదేవి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన జోనల్ కమిషనర్ బీవీ రమణ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బంగ్లా కూడలిలో పడకేసిన హైమాస్ట్ దీపాలు

పరవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ సబ్ స్టేషన్ జంక్షన్‌లో కొన్నాళ్లుగా హైమాస్ట్ దీపాలు వెలగడం లేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో రాత్రి వేళలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జంక్షన్ వద్ద రహదారి సైతం ధ్వంసమై పెద్ద గుంత ఏర్పడింది. దీని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి జంక్షన్‌లో హైమాస్ట్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మర్లమ్మతల్లి అనుపోత్సవం


మర్లమ్మతల్లి ప్రతిమ

సబ్బవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): పెదనాయుడుపాలెం ప్రజల ఆరాధ్య దైవం మర్లమ్మతల్లి అనుపోత్సవం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించు కునేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం కోలాటం, చిడతల భజనలు, నేల డ్యాన్స్‌లతో అమ్మవారి ఊరేగింపు, అనుపోత్సవం జరుగుతాయి. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రాత్రికి రాజసింహం సాంఘిక నాటకం ప్రదర్శన ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మురళీనాయక్‌కు ఘన నివాళి


జవాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

పరవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను అంతమొందించడంలో భాగంగా వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సోమవారం విశాఖ ఫార్మాసిటీలోని ఉద్యోగులు నివాళులు అర్పించారు. తొలుత రాంకీ హెచ్‌ఆర్ డీజీఎం గిరిధరరావు భక్తి వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశం కోసం యువ జవాన్ ప్రాణాలు కోల్పోవడం తీరని లోటని జీడీఎం పేర్కొన్నారు.

అధ్వానంగా హాస్టల్


బీసీ బాలికల వసతిగృహం

శిథిలమైన బీసీ బాలికల వసతిగృహ భవనం

- ప్రత్యామ్నాయంగా చిన్నపాటి భవనం నిర్మించిన ఎన్టీపీసీ యాజమాన్యం
- అరకొర వసతితో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
- తుప్పుపట్టిన ఇనుప మంచాలు
- పనిచేయని ఆర్వో ప్లాంట్
- రన్నింగ్ వాటర్ లేని మరుగుదొడ్లు


పెచులు ఊడిన శ్లాబ్


కాంక్రీట్ ఊడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్న పిల్లర్

పరవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి మెట్టపాలెంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరింది. దీంతో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మించిన చిన్నపాటి భవనంలో సుమారు 60 మంది విద్యార్థినులు ఇరుక్కుని ఉండాల్సి వస్తున్నది. సామాన్లతో ఇక్కడే చదువుకోవడం, ఇక్కడే నిద్రించాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న బాలికలకు ఇక్కడ వసతి కల్పిస్తారు. సోలార్ సిస్టమ్, ఇనుప బెడ్లు, ఇతర సామగ్రి తుప్పపట్టి మూలకు చేరాయి. బాలికలు నేల మీదనే నిద్రించాల్సి వస్తున్నది. వసతిగృహంలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేకపోవడంతో బాలికలు బకెట్లతో నీరు మోసుకెళ్లాల్సి వస్తున్నది.

కాగా శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కిచెన్‌గా వినియోగిస్తున్నారు. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. పిల్లర్ల కాంక్రీట్ ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో శ్లాబ్ కారిపోతున్నది. బాలికలు ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో మధ్యాహ్నం, రాత్రి, మిగిలిన రోజుల్లో రాత్రిపూట శిథిల భవనంలోనే భోజనాలు చేస్తున్నారు. ఈ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని బాలికలు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి శ్రామికులపై తేనెటీగల దాడి

- పలువురికి గాయాలు

మాకవరపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురం గ్రామంలో ఉపాధి శ్రామికులపై తేనెటీగల దాడిచేయడంతో పలువురు గాయపడ్డారు. జి.గంగవరం పంచాయతీ శివారు శ్రీరామపురంలో మాకిరెడ్డి వాని చెరువులో సోమవారం ఉపాధి శ్రామికులు పనులు చేస్తున్నారు. చెరువులో ఉన్న తుప్పలను తొలగిస్తుండగా చెట్లపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో ఉపాధి శ్రామికులు పరుగులు తీశారు. అయితే కొంత మందిపై తేనెటీగలు దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో బంగారు సత్యనారాయణ, పప్పుల పార్వతమ్మ, బంగారు రాజేశ్వరి, గంగునాయుడు, పరదేశమ్మ, తదితరులు ఉన్నారు. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

అర్జీలపై సత్వర చర్యలు తీసుకోవాలి

- పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు ఇచ్చిన అర్జీల్లోని సమస్యలు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్ఓ సత్యనారాయణరావు, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాసరావులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి జాహ్నవి మాట్లాడుతూ, అర్జీలో పేర్కొన్న సమస్యకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపలేని, ఒకవేళ నిబంధనల మేరకు పరిష్కరించడానికి వీలుకాకపోతే ఆ విషయాన్ని అర్జీదారులకు వివరించాలని చెప్పారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 258 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.


పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవికి సమస్య చెప్పుకుంటున్న అర్జీదారుడు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఫిర్యాదును చట్టానికి, నిబంధనలకు లోబడి పోలీస్ శాఖ పరిష్కరిస్తుందని ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను స్వయంగా ఆలకించారు. అనంతరం ఆయా అర్జీలను సంబంధిత పోలీసు స్టేషన్‌లకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, చట్ట పరిధిలో ఉన్న ప్రతీ అర్జీని పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మొత్తం 20 అర్జీలు అందగా వీటిలో ఆస్తిత గాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నాయి.

జోరుగా సేంద్రీయ కూరగాయల విక్రయాలు


మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రీయ కూరగాయల స్టాల్

చోడవరం, మే12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సేంద్రీయ కూరగాయల విక్రయాల స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగుచేసి పండించిన కూరగాయలను ఈ స్టాల్‌లో ఉంచి అమ్ముతున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించే దిశగా అన్ని మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఈ స్టాల్‌ను ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది తెలిపారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే వారితో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యాలయం సిబ్బందికి కూడా ఆర్గానిక్ పంటలు పరిచయం చేయడంతో పాటు, వారి ద్వారా ఈ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో వీటిని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని, స్టాల్‌లో ఉన్న కూరగాయల విక్రయాలు బాగానే ఉంటున్నాయని సిబ్బంది తెలిపారు.

మెగా డీఎస్సీలో ఎస్టీ పోస్టులను మినహాయించాలి


మాట్లాడుతున్న స్పెషల్ డీఎస్సీ సాధన సమితి నేత పి.అప్పలనర్స

పాడేరు, మే 12(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో గిరిజనులకు సంబంధించిన పోస్టులను మినహాయించాలని స్పెషల్ డీఎస్సీ సాధన సమితి నేత పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని టీచర్ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలనే, శతశాతం ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలనే అంశాలపై చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, కాని కాలయాపన చేయకుండా గిరిజనులకు న్యాయం చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే దీనిపై ప్రభుత్వం కసరత్తు చేసిందని, దానిని మరింత వేగవంతం చేయాలన్నారు. లేకుంటే మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి, తర్వాత వాటి భర్తీకి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డీఎస్సీ సాధన సమితి నేతలు కె.రాధాకృష్ణ, కె.కాంతారావు, ఎస్.మాణిక్యం, కె.రాజశేఖర్, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్ నెట్‌కు పూర్వవైభవం తేవాలి

- సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించాలి
- కేబుల్ ఆపరేటర్ల సంఘాల వినతి



కలెక్టరేట్ వద్ద కేబుల్ ఆపరేటర్ల నిరసన

అనకాపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్)పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే సమీక్ష నిర్వహించి, సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని వివిధ కేబుల్ ఆపరేటర్ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ), ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ (ఎఫ్ఓఎఫ్), మల్టీ సర్వీసెస్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల శ్రీరామ్, మల్టీ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు కొణతాల ప్రకాశ్, ఎఫ్ఓఎఫ్ జిల్లా అధ్యక్షుడు నడింపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మందికి తక్కువ ధరకు పలు సేవలు అందిస్తున్న ఫైబర్‌నెట్ నిర్వహణ నానాటికీ అధ్వానంగా తయారవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు గతంలో (2017) ముఖ్యమంత్రి వున్నప్పుడు అప్పటి రాష్ట్రపతి చేతుల మీదుగా ఏపీఎస్ఎఫ్ఎల్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు. నామమాత్రం రుసుముతో ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్ ఫోను వంటి మూడు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. ఏపీఎస్ఎఫ్ఎల్ సిబ్బంది కొరత కారణంగా సేవలకు అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌ను నమ్ముకుని లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన ఆపరేటర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి చేరేలా వినతిపత్రం అందించారు.

నేడు పాడేరు మోదకొండమ్మ అనుపోత్సవం

- ఘనంగా ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పాడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన మంగళవారం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సతకంపట్టులో కొలువు తీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంటున్నది. ఇక్కడ కొలువు తీర్చిన అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను తిరిగి ఆలయంలో అనుపు తీర్చే తంతును మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రకరకాల నృత్యాలు, వేషాలు, డప్పుల వాయిద్యాల సందడి వాతావరణంలో ఉత్సవ మూర్తిని, పాదాలను ఊరేగిస్తారు. మంగళవారం రాత్రంతా భక్తులను అలరించేందుకు సినీ, టీవీ, జానపద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కాగాప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ కుటుంబంతో సహా సోమవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన గతంలో ఇక్కడే ఏఎస్పీగా, తరువాత నర్సీపట్నం ఓఎస్డీగా పని చేశారు.


విశేష అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

రాష్ట్ర శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం పాడేరు రానున్నారు. మోదకొండమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుంటారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే అనుపోత్సవంలో ఆమె పాల్గొంటారు.

కలగానే కాలిబాట వంతెన

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి కదలిక లేదు. తరువాత డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి రూ.3 కోట్లు కేటాయించడంతో 2020 జనవరి 9న వంతెన నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ (తరువాత మంత్రి అయ్యారు) గవరపేట వీధికి సమీపంలో శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణ పనులు ఏడాదిలో పూర్తవుతాయని, కశింకోట వాసుల కష్టాలు తొలగుతాయని చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించారు. అదే ఏడాది జూన్‌నాటికి మొత్తం 16 పైల్స్‌కిగాను (నదిలో నిర్మించే సిమెంట్ పిల్లర్ల పునాదులు) 11 పైల్స్ పనులు పూర్తిచేశారు. మొదటి విడతగా రూ.50 లక్షలకు బిల్లు పెట్టారు. వారాలు, నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఆ తరువాత అమర్‌నాథ్ రెండేళ్లకుపైగా మంత్రిగా పనిచేశారు. కానీ కశింకోటలో శారదా నదిపై కాలిబాట వంతెన నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం

- వేణుగోపాల్, పంచాయతీరాజ్ డీఈ, అనకాపల్లి

కశింకోట వద్ద శారదా నదిపై కాలిబాట వంతెన నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ.50 లక్షలు ఖర్చు కొన్ని పైల్స్ నిర్మించారు. బిల్లు రాలేదని కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్టు తెలిసింది. కాలిబాట వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు అవసరం అవుతాయి. ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం.

సమ్మర్ ట్రిప్స్ క్యాన్సిల్

... 5వ పేజీ తరువాయి

క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇప్పుడు కశ్మీర్ పర్యటనకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. పొరుగునే తమిళనాడు రాష్ట్రంలో ఊటీ వెళ్లడానికి టికెట్లు బుక్ చేసుకున్న వారు సైతం వాటిని రద్దు చేసుకుంటున్నారు. అక్కడ ఎటువంటి ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు లేవని, సంతోషంగా వెళ్లి రావచ్చునని ట్రావెల్ ఏజెన్సీలు నచ్చజెప్పడానికి యత్నిస్తున్నా ముందుకురావడం లేదు. బిక్కుబిక్కుమంటూ అంతంత దూరం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోలేమని, టికెట్లు రద్దు చేయాలని ఒత్తిడి పెట్టడంతో ఏజెన్సీలు ఇక తప్పదని డబ్బులు వెనక్కి ఇస్తున్నాయి.

కోడ్ ఇవ్వడంతో టిక్కెట్ల రద్దు

- కె.విజయమోహన్, అధ్యక్షులు, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్.

దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంతో 15 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టికెట్లు బుక్ చేసుకున్నవారికి ప్రత్యేకంగా 'కోడ్' ఇచ్చింది. దానిని ఉపయోగించుకొని టికెట్లు రద్దు చేసుకుంటే డబ్బులు వాపస్ ఇస్తామని వెల్లడించింది. దాంతో గత మూడు రోజుల్లో మా సంస్థలోనే 300 మంది టికెట్లు రద్దు చేసు కున్నారు. దేశీయ పర్యాటక రంగంపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

క్రైం... crime news

మహిళ మృతికి కారకుడైన వ్యక్తికి యావజ్జీవ కారాగారశిక్ష

చోడవరం, మే 12(ఆంధ్రజ్యోతి): కల్లు చెట్టు విషయంలో తలెత్తిన వివాదంలో ఓ మహిళ మృతికి కారకుడైన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ సోమవారం తీర్పు ఇచ్చారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం జోడిగుడ గ్రామానికి చెందిన కిలోదయాత్రి రఘునాథ్(50)కు గ్రామంలో కల్లు చెట్టు ఉంది. ఈ కల్లు చెట్టును అదే గ్రామానికి చెందిన కిల్లో ముకుంద్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చి, రోజూ కల్లు అమ్మగా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం తీసుకునేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో 2013 ఫిబ్రవరి 14న రఘునాథ్.., ముకుంద్ ఇంటికి వెళ్లి అతనితో ఘర్షణకు దిగి దాడికి పాల్పడ్డాడు. తన భర్తపై దాడి చేస్తున్న రఘునాథ్‌ను ముకుంద్ భార్య లక్ష్మి అడ్డుకోవడంతో రఘునాథ్... లక్ష్మి తలపై ఇనుపరాడ్‌తో కొట్టాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ, వారం రోజుల తరువాత మృతిచెందింది. దీనిపై అప్పటి డుంబ్రిగుడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 20మంది సాక్షులను విచారించిన అనంతరం, నిందితుడు రఘునాథ్‌పై మోపిన అభియోగం రుజువు కావడంతో అతనికి యావజ్జీవ కారాగారశిక్షతోపాటు, రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి రత్నకుమార్ తీర్పు ఇచ్చారు. ఈ శిక్షతో పాటు, 324 ఐపీసీ ప్రకారం మరో రూ.2వేలు జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో రెండేళ్ల జైలు శిక్ష, 448 సెక్షన్ కింద మరో వెయ్యి రూపాయలు జరిమానా, అలాగే జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో స్పష్టం చేశారు.

బిల్లులు లేని 500 లీటర్ల డీజిల్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న డీజిల్ క్యాన్లు

ఎస్.రాయవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి బిల్లులు లేకుండా ఆటోలో తరలిస్తున్న 500 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. బంగారమ్మపాలెం నుంచి అడ్డరోడ్డు వైపు ఒక ఆటోలో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొరుప్రోలు జంక్షన్ వద్ద మాటు వేశారు. కొద్దిసేపటి తరువాత బంగారమ్మపాలెం వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. పది క్యాన్లలో సుమారు 500 లీటర్ల డిజిల్‌ను రవాణా చేస్తుండడంతో ఆటో డ్రైవర్‌ను బిల్లులు అడిగారు. అతను ఆధారాలు ఏవీ చూపకపోవడంతో ఆటోతోసహా డీజిల్ క్యాన్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. తిమ్మాపురానికి చెందిన ఆటో డ్రైవర్ పి.అచ్చిబాబును అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన జగ్గు అనే వ్యక్తి డీజిల్ అక్రమంగా విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


ధనిమిరెడ్డి శ్రీను (ఫైల్ ఫొటో)

కృష్ణాదేవిపేట, మే 12(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి శ్రీను(52) కొంత కాలంగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బాధ తాళలేక వ్యవసాయ పనులకు ఉపయోగించే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతని భార్య గుర్తించి వెంటనే 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించింది. అయితే అతని పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి


ప్రమాదానికి గురైన కారు, (ఇన్‌సెట్‌లో) నవీన్‌రెడ్డి మృతదేహం

లంకెలపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. విశాఖ నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన చింతపల్లి నవీన్‌రెడ్డి (27) సోమవారం ఉదయం తన కారులో రాజమహేంద్రవరం బయలు దేరాడు. లంకెలపాలెం కూడలి దాటిన తరువాత మరిడిమాంబ ఆలయం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీను బలంగా ఢీకొన్నాడు. దీంతో నవీన్‌రెడ్డి కారులోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవరాపల్లి హైస్కూల్లో నాగుపాము హల్‌చల్

దేవరాపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం నాగుపాము హల్ చల్ చేసింది. అది ఎలుకను మింగేసి కదలలేని స్థితిలో గోతిలో పడి ఉంది. ఉదయం హైస్కూల్‌లో మార్నింగ్ వాకింగ్‌కి వచ్చిన గొరస బ్రహ్మేంద్ర అనే వ్యక్తి నాగుపామును చూశాడు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు స్నేక్‌క్యాచర్ కృష్ణకు తెలపగా అక్కడికి వచ్చి ఎంతో చాకచక్యంగా పట్టుకుని సంచిలో బంధించి అటవీప్రాంతంలో విడిచిపెట్టాడు.

ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వారిలో ఎక్కువమంది సర్దుబాటుకు అవకాశం ఏర్పడింది. దీంతో వచ్చే వారంలో చేపట్టనున్న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు లేకపోవడంతో పదోన్నతులు ఎలా ఇస్తారని పలువురు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే రెండు నెలల్లో ఎక్కువ మంది టీచర్లు పదవీ విరమణ చేయనున్నందున...అప్పుడు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు.

మాడుగులలో అన్న క్యాంటీన్

... 5వ పేజీ తరువాయి

ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రూ.65 లక్షలతో త్వర లో భవన నిర్మాణ పనులు మొదలవుతాయని చెప్పారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దుర్గాలమ్మ ఆలయ సమీపంలో ఇప్పటికే స్థల పరిశీలన చేసి అన్న క్యాంటీన్‌ను ఇక్కడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్థలానికి కొలతలు తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, సర్పంచ్ యడ్ల కళావతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డాది రంజిత్‌వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509